## పిక్నిక్‌లో విషాదం.. డ్యామ్ గేటు తెరవడంతో ఆరుగురు మృతి

బెంగుళూరు: కర్నాటకలోని తుమకూరులో విషాదం చోటుచేసుకున్నది. మర్కోనహల్లి డ్యామ్ గేట్లు తెరవడంతో ఆ నీటి ప్రవాహంలో ఆరు మంది కొట్టుకుపోయారు. తుమకూరు ఎస్పీ అశోక్ కేవీ ఈ ఘటన గురించి వివరించారు. పిక్నిక్‌లో భాగంగా 15 మంది డ్యామ్ వద్దకు వెళ్లారు. దీంట్లో ఏడు మంది చిన్నారులు, మహిళలు నీటిలోకి ప్రవేశించారు. అయితే అకస్మాత్తుగా సైఫన్ సిస్టమ్ తెరుచుకున్నది. ఒక్కసారిగా నీళ్లు డ్యామ్ నుంచి ప్రవహించాయి. శక్తివంతంగా వచ్చిన ఆ వరదతో నీటిలో ఉన్న ఏడుగురు కొట్టుకుపోయారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు ఆ ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నాయి. అయితే నవాజ్ అనే వ్యక్తిని రెస్క్యూ చేశాడు. ఆదిచుంచనగిరి ఆస్పత్రిలో అతన్ని చేర్చారు. ఇప్పటి వరకు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన మరో నలగురి కోసం గాలిస్తున్నారు. బాధితులందరూ మహిళలు, అమ్మాయిలే ఉన్నారు. అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరగడం వల్లే ఈ ఘటన జరిగినట్లు డ్యామ్ ఇంజినీర్లు చెబుతున్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :194 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 09-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## సంక్షేమ గురుకులాలకు తాళాలు.. రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ వార్నింగ్



హైదరాబాద్,యావత్ దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దెలు పేరుకుపోయి చివరికి తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, గురుకుల భవనాలకు ఏకంగా ఏడాది కాలం నుంచి అద్దెబకాయిలు చెల్లించకపోవడం రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అత్యుత్తమ వ్యవస్థను కుప్పకూల్చి కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే సీఎం రేవంత్ ఇదంతా చేస్తున్నట్టు అనుమానం కలుగుతోందని కేటీఆర్ అన్నారు. ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్‌బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెడుతున్న ముఖ్యమంత్రి సంక్షేమ గురుకులాలను కూడా సమాధి చేసే పన్నాగాలు చేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకుంటే మంచిదని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లు నిండకుండానే రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి, కనీసం గురుకులాల కిరాయి కూడా కట్టకుండా ఆ సొమ్ముతో ఎవరి జేబులు నింపుతున్నాడో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని అన్ని గురుకుల భవనాల అద్దె బకాయిలను విడుదలచేసి విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ గురుకులాలకు తాళాలు వేసే దుస్థితే వస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి తెలంగాణ వ్యాప్తంగా ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని కేటీఆర్ అన్నారు. చిన్నారుల భవితవ్యంతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## అద్లూరితో నా అనుబంధం విడదీయరానిది.. మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,మంత్రి అద్లూరి లక్ష్మణ్‌తో వివాదంపై పొన్నం ప్రభాకర్ స్పందించారు. అద్లూరి తనకు సోదరుడిలాంటి వారని తెలిపారు. కాంగ్రెస్‌లో మాకు 30 ఏళ్ల స్నేహబంధం ఉందని అన్నారు. ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం విడదీయరానిది అని అన్నారు. మంత్రులు అద్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ వివాదంపై కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా ఉంది. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పీసీసీ రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే పొన్నం ప్రభాకర్, అద్లూరితో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి హాజరయ్యే ముందు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. అద్లూరి లక్ష్మణ్‌పై ఎలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. తనకు ఎవరిపైనా విద్వేషం ఉండదని తెలిపారు. కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేశారని అన్నారు. అద్లూరి బాధపడ్డారని తెలిసి తీవ్రంగా విచారిస్తున్నానని అన్నారు. అద్లూరి మనసు నొచ్చుకుని ఉంటే చింతిస్తున్నానని చెప్పారు. కాగా, ఇదే సమయంలో అద్లూరి లక్ష్మణ్ కూడా మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా చిన్న విషయమని.. సమసిపోతుందని అన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. సమావేశం తర్వాత వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

అసలేం జరిగిందంటే..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఇన్‌చార్జి మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశానికి అందరూ వచ్చారు. కానీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే చెందిన సహచర మంత్రి అద్లూరి లక్ష్మణ్ సమయానికి రాలేకపోయారు. దీంతో పొన్నం అసహనానికి లోనయ్యారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేశారు. పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో గుసగుసగా 'మనకు టైం అంటే తెలుసు.. జీవితమంటే తెలుసు..



వారికేం తెలుసు ఆ..దున్నపోతు గానికి' అంటుండగా మైక్ స్పీకర్లు ఆన్‌చేసి ఉండటంతో అది బయటకు వినిపించింది. అప్పటికే మీడియా కెమెరాల్లో అదంతా రికార్డయింది. మళ్లీ కొద్ది నిమిషాలకే 'వస్తుండా? స్టార్ట్ అయినంక జాయిన్ అయితాడా?' అంటూ మైనార్టీ నేతలను ఉద్దేశిస్తూ 'మొదలు పెట్టండి' అని ఆర్డర్ వేసినట్టుగా పొన్నం మాట్లాడారు. మరో మంత్రి లేకుండా ప్రెస్‌మీట్ ఎలా మొదలుపెడుతామని మైనార్టీ నేతలు సందిగ్ధంలో పడి వెనుకముందాడారు. దీంతో మరోసారి పొన్నం మైక్ అందుకొని 'మీరు మాట్లాడుతారా? నన్ను మాట్లాడుమంటారా?' అంటూ దబాయిస్తున్నట్టుగా మాట్లాడారు. ఇదంతా కెమెరాల్లో రికార్డయింది. మీడియా సమావేశం కవరింగ్ కోసం వచ్చిన యూట్యూబర్లు ఈ వీడియోను సోషల్ మీడియాలో పెట్టగా, నిమిషాల్లోనే వైరల్ అయింది. దీంతో నాలుక కరుచుకున్న పొన్నం ప్రభాకర్ ఖండన ప్రకటన చేశారు.

## ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటన.. అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కీలక ఆదేశాలు

అమరావతి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16వ తేదీన శ్రీశైలంలో పర్యటించనున్నారు. జ్యోతిర్లింగ క్షేత్రం మల్లికార్జునస్వామి ఆలయానికి ప్రధాని మోదీ తొలిసారిగా రానున్నారు. దేవాతామూర్తులకు ప్రధాని మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ క్రమంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై కర్నూలు జిల్లా కలెక్టర్‌తో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ.సిరి, జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఎస్ ఈ, ఈఈ లలకి మంత్రి పలు సూచనలు చేశారు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ప్రధాని పర్యటన వేళ జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆర్ అండ్ బీ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఎక్కువగా ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. జాతీయ రహదారుల్లో అకస్మాత్తుగా ట్రాఫిక్ స్థంభించిపోయే సమస్యలను అధిగమించేందుకు.. ప్రత్యామ్నాయంగా ఎస్కేప్



రోడ్డు మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. శ్రీశైలంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో, స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మార్గనిర్దేశం చేశారు. శ్రీశైలంలో స్థానికంగా రహదారుల మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే, ఇతర జిల్లాల ఆర్ అండ్ బీ శాఖ అధికారులను వినియోగించుకుని, సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి



హైదరాబాద్ (గచ్చిబౌలి) : టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడే విధంగా ఉండాలని, దానిని భర్తీ చేయకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హెచ్ సియు చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. విద్య సమాజంలో సమ గ్రమైన, అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మిం చే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ 25వ స్నాతకోత్సవ వేడుకలను మంగళ వారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతోకలిసి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎక్జిక్యూటీవ్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా ముఖ్యఅతిధులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 1717మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు ప్రక టించగా, అందులో 990 మంది తమ పట్టాలను అందుకున్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్వర్మ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు ఆలోచన, విద్యార్థుల కష్టానికి వేడుకగా స్నాత కోత్సవాన్ని అభివర్ణిం అభివర్ణించారు. మానవుడి ఉనికి అంతిమ లక్ష్యం మేధస్సును పెంచడమే కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఉటం కించారు. నేటి యువతకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి, తోటి వారికీ సేవ చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేట్లు వినయాన్ని వదులుకోవద్దని, ఇతరులకు అవకాశాలు సృష్టించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు క్రిష్ణ ఎల్లా మాట్లాడుతూ భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే మన యువత ఆవిష్కరణలు, నైపుణ్యం మీద దృష్టి సారించాలని సూచించారు. విశ్వవిద్యాలయం డిగ్రీ పట్టాను ఇస్తుందని, కానీ ఉత్తమ ఆవిష్కరణ, నైపూణ్యం జీవితంలో ముం దుకు తీసుకువెళ్తాయని అన్నారు. నేటి విద్యార్థులు ఉద్యోగాల వేటలో పడి ఉద్యోగ అన్వేషకులుగా మారుతున్నారని, ఉద్యోగ సృష్టికర్తలుగా మారా లని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతీయ శాస్త్రవేత్తల సందేహాలు వ్యక్తం చేశారని, కానీ కోవిడ్ వ్యాక్సిన్ను సొంతంగా తయారు చేసి భారతీయుల సైనను, మేధోసంపత్తిని ప్రపం చానికి చూపించామన్నారు. హెచ్సీయు వైస్ చాన్సిలర్ బిజె.రావు మాట్లా డుతూ హైదరాబాద్సెంట్రల్ యూనివర్సిటీ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని, ఇది ఒక గ్రీన్ క్యాంపస్ అని అన్నారు. ప్రపంచ క్యూఎస్ ర్యాంకింగ్స్ లో హెచ్సీయు గత సంవత్సరం ఉన్న 372 నుంచి ఈ సంవత్సరం 335కు చేరిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, నూతన టెక్నాల జీలో సవాళ్లను పరిష్కరించేందుకు 6 విశ్వవిద్యాల యాలను అనుసంధానం చేస్తూ 100కోట్లతో ఏర్పాటు చేసిన ఎఎన్ఆర్ఎఫ్ ప్రాజెక్టుకు హెచ్సీయు నాయకత్వం వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపాన్ని అధిగమించి ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ పట్టా అందుకున్న విద్యార్థిణి గోపితేజస్విక్ ఓబిసి కేటగిరి గోల్డ్మె డల్ను అందజేశారు.


## టాటా గ్రూప్‌లో ఆధిపత్య పోరు.. రంగంలోకి కేంద్రం..?



న్యూఢిల్లీ, దేశంలోనే దిగ్గజ సంస్థల్లో టాటా గ్రూప్ ముందు వరుసలో ఉంటుంది. దేశంలోనే అత్యంత విలువైన, విశ్వసనీయ సంస్థగా టాటా గ్రూప్‌కు మంచి పేరుంది. దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా సంస్థను దశాబ్దాల పాటు ముందుండి నడిపించారు. గ్రూప్ చైర్మన్‌గా, టాటా ట్రస్ట్ అధిపతిగా ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. అయితే, ఆయన మరణంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. గ్రూప్ సంస్థల్లో ఉన్న సమన్వయం, వ్యక్తిగత ప్రభావం రతన్ టాటాతోనే కనుమరుగైనట్లు తెలుస్తోంది. సంస్థలో ప్రస్తుతం ఆధిపత్య పోరు కొనసాగుతోందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ దిగ్గజ సంస్థ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉందని, కేంద్రం జోక్యం చేసుకునే పరిస్థితికి చేరిందని వార్తలొస్తున్నాయి. టాటా ట్రస్ట్, గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తుతున్నట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. రతన్ టాటా మరణానంతరం టాటా ట్రస్ట్ కొత్త చైర్మన్‌గా నోయెల్ టాటా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే రతన్ టాటా ఉన్నంత వరకు.. ఆయన తీసుకునే ఏ నిర్ణయాన్ని ట్రస్టీలు, నామినీ డైరెక్టర్లు ఏనాడూ ప్రశ్నించలేదు, అడ్డు చెప్పలేదు. కానీ, ప్రస్తుత చైర్మన్ నోయెల్ టాటాకు మాత్రం ఆ స్వేచ్ఛ లేదు. ఆయన తీసుకునే నిర్ణయాలకు ట్రస్టీలు అడ్డుచెప్తున్నట్లు తెలుస్తోంది. ట్రస్టీల్లో కీలకంగా ఉన్న మెహిల్ మిస్త్రీ.. నోయెల్ తీసుకొనే కొన్ని కీలక నిర్ణయాల్ని బహిరంగంగానే విమర్శిస్తూ వస్తున్నారు. ఈయనకు టాటా సన్స్‌లో వాటా ఉన్న షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబంతో అనుబంధం ఉంది. టాటా సన్స్ బోర్డులో కొత్త డైరెక్టర్ల నియామకాల అంశంలో ట్రస్టీల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్నాయని సమాచారం. నామినీ డైరెక్టర్‌గా విజయ్ సింగ్‌ను తిరిగి నియమించాలనుకున్న ప్రతిపాదనను నలుగురు ట్రస్టీలు వ్యతిరేకించారు. టాటా సన్స్ బోర్డు సమావేశాల గురించి తమకు సరైన సమాచారం లభించట్లేదని వారు ఆరోపించారు. ఇక్కడ కొత్త నామినీ డైరెక్టర్లుగా ఎవరిని తీసుకోవాలనే విషయంలోనూ సంఘర్షణలు తలెత్తుతున్నాయి. రతన్ టాటా లాగా సంస్థలో నోయెల్ అధికారం చెలాయించలేక పోతున్నారనేది విశ్వసనీయ వర్గాల సమాచారం. టాటాల బోర్డులో తలెత్తిన విభేధాలను సద్దుమణిగేలా చేసేందుకు కేంద్రం జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. టాటా ట్రస్టలలో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని కోరినట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. టాటా ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటా, వైస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ట్రస్టీ డారియస్ ఖంబటాలతో సమావేశమైనట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. అంతర్గత చీలికలు టాటా సన్స్ కార్యకలాపాలను ప్రభావితం చేస్తాయని హెచ్చరించినట్లు తెలుస్తోంది. సంస్థలో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని సూచించినట్లు సమాచారం. ఈ విభేదాల వేళ ఈనెల 10న టాటా ట్రస్ట్ బోర్డు సమావేశం కానుంది. గ్రూప్‌లోని వివాదాస్పద అంశాలు ఇందులో కొలిక్కి రావొచ్చని భావిస్తున్నారు.

## ఇండియాలో ఇన్వెస్ట్ చేసేందుకు ఇదే బెస్ట్ టైం : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే ఉత్తమ సమయం అని ప్రధాని మోదీ అన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేకిన్ ఇండియాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మొబైల్స్, సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వేగంగా సంస్కరణలు జరగుతున్నాయని, ఇన్వెస్ట్‌మెట్ అవకాశాలకు ఇదే అత్యుత్తమ సమయం అని మోదీ తెలిపారు. భారతీయ ప్రజాస్వామ్య విధానం ఈజ్ ఆఫ్ బిజినెస్‌కు అనుకూలంగా ఉందన్నారు. తమ ప్రభుత్వ పాలసీలతో దేశం ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ప్రాంతంగా మారిందన్నారు. పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, మేకిన్ ఇండియాకు ఇదే ఉత్తమ సమయం అన్నారు. సంస్కరణల వేగాన్ని మరింత విస్తరిస్తున్నామని మోదీ తెలిపారు. సెమీకండక్టర్లు, మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తయారీలకు భారత్ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు ఇప్పుడు మరింత దూసుకెళ్లాలన్నారు. డిజిటల్ రంగంలో గత దశాబ్ధ కాలంలో ఇండియా వేగంగా ముందుకెళ్లిందన్నారు. భారత్‌లో 1జీబీ డేటా .. ఒక కప్పు ఛాయ్ ధర కన్నా తక్కువే అని తెలిపారు. డిజిటల్ కనెక్టివిటీ ఇప్పుడో ప్రత్యేక హక్కు లేదా లగ్జరీ కాదు అని, ఇది ప్రతి భారతీయుడి జీవితంలో అంతర్భాగమైందన్నారు.



ప్రపంచంలోనే అతిపెద్ద టెలికం మార్కెట్‌లో ఇండియా రెండో స్థానంలో ఉందన్నారు. 5జీ మార్కెట్‌లోనూ రెండో స్థానంలో ఉన్నామన్నారు. దేశంలో ఒకప్పుడు 2జీ సేవలు సరిగా అందలేదని, కానీ ఇప్పుడు ప్రతి జిల్లాలోనూ 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## మరో రెండు దగ్గు మందులను బ్యాన్ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, పిల్లలకు ప్రమాదకరంగా మారిన దగ్గు మందు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో రెండు దగ్గు మందులను రాష్ట్రంలో నిషేధించింది. ఇప్పటికే కోల్డ్ రిఫ్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఔషధ నియంత్రణ విభాగం (డీసీఏ) ప్రకటించగా.. తాజాగా రిలీఫ్, రెస్పి ఫ్రెస్-TR సిరప్‌లపై నిషేధం విధించింది. ఈ రెండు సిరప్‌లలో కల్తీ జరిగిందని తేలడంతో వాటి విక్రయాలు వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. దగ్గు మందు వాడకంపై ఇప్పటికే ప్రజారోగ్య విభాగం ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. పిల్లల్లో సాధారణంగా దగ్గు, జలుబు వచ్చినప్పుడు తగిన నివారణ చర్యలతోనే కట్టడి చేయవచ్చని.. వెంటనే తగ్గిపోవాలని ఎడాపెడా మందులను వాడితే చిన్నారుల ప్రాణాలకే ప్రమాదమని ప్రజారోగ్య విభాగం హెచ్చరించింది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందు ఇవ్వద్దని సూచించింది. ఐదేళ్లలోపు



చిన్నారులకు అత్యవసరమైతేనే దగ్గు మందు వాడాలని తెలిపింది.

## ఉద్యోగుల తండ్లాట పట్టించుకునే బాధ్యత లేదా..? రేవంత్‌పై ఆర్ఎస్పీ ధ్వజం




హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు రాక పడుతున్న ఇబ్బందులపై ఆర్ఎస్పీ ఎక్స్ వేదికగా స్పందించారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్ల మీదికొచ్చి కొట్లాడుకుంటున్నరు బాగానే ఉంది కానీ.. తెలంగాణ ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న సుమారు 5 వేల మంది ఉద్యోగులకు గత నాలుగు నెలల నుండి జీతాలు రాక హాహాకారాలు చేస్తున్నారు తెలుసా? వాళ్ల కుటుంబాలు ఆకలి చావుల అంచుల్లో ఉన్నాయి!! ఆకలితో ఉన్న ఉద్యోగులు పేద ఎస్సీ పిల్లలకు చదువెట్లా చెప్తరు..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

## సంపాదకీయం

గురువారం 09-10-2025

# తవ్వుకుంటే తట్టెడు...

తవ్వకం ఒక పురాతన ప్రక్రియ. నాగరికతలు మొదలైన నాటి నుంచే తవ్వకం ప్రక్రియ మనుషులకు తెలుసు. రకరకాల ప్రయోజనాల కోసం మనుషులు నేలను తవ్వుతారు. వ్యవసాయ అవసరాల కోసంబీ రక్షణ అవసరాల కోసంబీ విలువైన ఖనిజాల వెలికితీత కోసం %–% మనుషులకు తవ్వకం అలవాటైన పనే! చనిపోయిన మనుషుల మృతదేహా లను, జంతువుల మృతకళేబరాలను పాతిపెట్టడానికి కూడా నేలను తవ్వడం పురాతన కాలం నుంచి వస్తున్న అలవాటే! ఆధునిక కాలంలో తవ్వకాల తీరుతెన్నులు మారాయి. అమూల్య ఖనిజాల కోసమే కాదు, చారిత్రక అవశేషాల కోసం కూడా తవ్వకాలు జరపడం మొదలైంది. తవ్వకాల కారణంగానే అనేక చారిత్రక విశేషాలు బయటపడటంబీ ఒకప్పుడు భూమ్మీద జీవించి అంతరించిపోయిన జీవుల శిలాజాలు బయటపడటం మనకు తెలుసు. చారిత్రక, మానవ పరిణామ అవశేషాల కోసం శాస్త్రవేత్తలు తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. ఒక్కోచోట తవ్వుతుంటే లంకెబిందెల వంటి నిధినిక్షేపాలు బయటపడుతుంటాయి. మరొక్కోచోట తవ్వుతుంటే పురాతన కంకాళాలు బయటపడుతుంటాయి. ఏవి బయట పడినా, వాటితో పాటు చరిత్ర కూడా బయటపడుతుంటుంది. ఘనమైన కట్టడాలను నిర్మించాలంటే, పునాదుల కోసం నేలను తవ్వాలి. మృతులను పూడ్చిపెట్టాలంటే, సమాధుల కోసం తవ్వాలి. కొందరు పాలకులు సమాధులను అద్భుత నిర్మాణాలుగా తీర్చి దిద్దిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలు. అలాంటి వాటిలో ప్రపంచ వింతల్లో ఒకటిగా చెప్పుకొనే తాజ్‌మహల్ ఒకటి. అంతకంటే ముందు ఈజిప్టు సహా పలుచోట్ల సమాధుల మీద పిరమిడ్లు నిర్మించారు. పంటపొలాలకు నీరు పారించడం కోసం కాలువలు తవ్వుతారు. జలసమృద్ధి కోసం బావులు, చెరువులు నిర్మించడానికి కూడా నేలను తవ్వుతారు. రాతికోటలకు రక్షణ కల్పించడానికి చుట్టూ అగడ్తలను తవ్వుతారు. చరిత్రలో పేరు నిలిచిపోవాలనే కోరికతో కొందరు, మరణానంతరం పరలోకంలో అక్కరకొచ్చే పుణ్యాన్ని సంపాదించుకోవాలనే ఆశతో మరికొందరు రాజులు తమ తమ రాజ్యాలలో వాపీ కూప తటాకాదులను శక్తివంచన లేకుండా తవ్వించేవారు. సాధారణంగా నీటి అవసరాలు, రక్షణ అవసరాల కోసం మినహాయిస్తేబీ ఎక్కడైనా గోతులను తవ్వాక, పనులు పూర్తయిన వెంటనే వాటిని పూడ్చిపెడతారు. మన దేశంలోని పలు నగరాల్లో నగరపాలక సంస్థలు రకరకాల పనుల కోసం గోతులు తవ్వి, పనులు పూర్తయ్యాక వాటిని పూడ్చిపెట్టడం మరచిపోతుంటారు. 'ఎవరు తవ్విన గోతిలో వారే పడతారు' అనే సామెత ఉంది. కానీ, మన నగరపాలక సంస్థలు తవ్విపెట్టిన గోతుల్లో తరచుగా సామాన్య జనాలే పడుతుంటారు. కాబట్టి ఎవరు తవ్విన గోతిలో వారే పడతారు అనుకోవడాన్ని కేవలం ఒక అపోహగానే భావించాలి. అయితే, రాజకీయాల్లో మాత్రం గోతి కాడ నక్కల్లా మసలుకొనేవారే రాణిస్తుంటారు. చారిత్రక, శాస్త్ర పరిశోధనల్లోనే కాదుబీ గోతులకు, సమాధులకు భాషా సాహిత్యా ల్లోనూ ప్రాధాన్యం ఉంది. 'అర్ధంతరంగా విప్లవాన్ని ముగించిన వాడు తన గోతిని తానే తవ్వుకున్నవాడు అవుతాడు' అని జర్మన్ రచయిత జార్జ్ బుక్నర్ అన్నాడు. తన గోతిని తానే తవ్వుకోవడం కంటే అవివేకం మరొకటి ఉండదు. 'గత వైభవ మార్గాలన్నీ సమా ధుల వైపే దారితీస్తాయి' అన్నాడు ఇంగ్లిష్ కవి థామస్ గ్రే. సమాధులను తవ్వేటప్పుడే గత వైభవానికి చెందిన ఆనవాళ్లు బయటపడిన సందర్భాలు కోకొల్లలు. మానవ నాగరికత ప్రస్థానంలో ఇంతటి ప్రాశస్త్యమున్న గోతులు తవ్వే విద్యలో పోటీలు లేకపోవడాన్ని లోటుగా భావించిన హంగేరియన్లు– ఆ లోటు తీర్చడానికి సమాధుల కోసం గోతులు తవ్వే పోటీని ప్రారంభించారు. అలాగని ఇదేదో స్థానిక పోటీ కాదు, అంతర్జాతీయ పోటీ. హంగరీ శ్మశాన వాటికల నిర్వహణ సంఘం ఎనిమిదేళ్లుగా పోటీ నిర్వహిస్తూ వస్తోంది. 'కరోనా' కాలంలో రెండేళ్లు ఈ పోటీకి అవరోధం ఏర్పడినా, ఈ ఏడాది ఇటీవల జరిగిన పోటీల్లో లాజ్లో కిస్, రాబర్ట్ నేగీ అనే వారు శరవేగంగా నిర్ణీత కొలతల్లో సమాధి గోతిని తవ్వి విజేతలుగా నిలిచారు.

# పరువు నష్టం... నేరమా కాదా?



న్యూఢిల్లీ,పరువు నష్టం కేసులను నేర పరిధిలోంచి మినహాయించాల్సిన సమయం వచ్చిందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. అసమ్మతి స్వరాలను అణచివేయడానికి, విమర్శకుల నోళ్లు మూయించడానికి శక్తిమంతమైన వ్యక్తులు పరువు నష్టం నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛ ముసుగులో వ్యక్తిత్వ హననాలకు పాల్పడే నకిలీ వార్తలూ విపరీతంగా ప్రచారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పరువు నష్టాన్ని నేరంగా పరిగణించడం మంచిదా కాదా అన్న దానిపై దేశవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. వ్యక్తిగౌరవం, సమాజ సమష్టి శ్రేయస్సు, ప్రజాస్వామ్య విశిష్ట లక్షణాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంశాన్ని పరిశీలించాల్సి ఉంది.ఒకరి మాటలు, చేష్టలు, రాతల ద్వారా మరొకరికి పరువు నష్టం జరుగుతుంది. భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ) సెక్షన్ 499లో పరువు నష్టాన్ని నేరంగా నిర్దేశించారు. అదే భారతీయ న్యాయసంహిత(బీఎన్‌ఎస్)లో సెక్షన్ 356గా మారింది. 19వ రాజ్యాంగ అధికరణ భావప్రకటన స్వేచ్ఛకు హామీ ఇస్తోంది. కానీ, ఆర్టికల్ 19(2) కింద అదే రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛకు పరిమితులు నిర్దేశించే వీలు కల్పించింది. ఏదైనా చట్టం ద్వారా ఇలాంటి పరిమితులను విధించవచ్చు. దీన్ని అనుసరించే పరువు నష్టాన్ని నేర పరిధిలోకి తీసుకొచ్చారు. ఉద్దేశపూర్వకంగా వేరొకరి పరువు మర్యాదలకు కళంకం తీసుకురావడాన్ని నేరంగా పరిగణించారు. అయితే, దీనికి కొన్ని మినహాయింపులు బీఎన్‌ఎస్‌లోనే ఉన్నాయి. ఏదైనా నిందారోపణ లేదా నేరారోపణ ఆ వ్యక్తి పరువుకు నష్టం కలిగిస్తూ అతణ్ని అవమానపరిచేట్లు, తోటివారిలో అతనిపై అసహ్యం పుట్టించేట్లు ఉంటే– అది నేరం అవుతుంది. అయితే పత్రికలూ ప్రసారమాధ్యమాల ద్వారా ఎవరైనా సదుద్దేశంతో సమాజ హితాన్ని కోరుతూ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేయడం తప్పుకాదు. ప్రజాసేవకుల కార్యకలాపాల్లో తప్పొప్పులు, ప్రజా పనుల్లో వైఫల్యాల గురించి ప్రచురించడం/ ప్రసారం చేయడం నేరం కిందికి రాదు. అలాగే, ఏదైనా న్యాయస్థానంలో నడుస్తున్న సివిల్, క్రిమినల్ వ్యాజ్యాల మీద సదుద్దేశంతో... ఆయా కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల, సాక్షుల, వారి ఏజెంట్ల కార్యకలాపాలూ పాత్రలపై ఏదైనా వార్త ప్రసారం చేస్తే, అది కూడా నేరమవ్వదు.

### విమర్శలను స్వీకరించాలి

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఏది పరువు నష్టం కిందకు వస్తుంది, ఏది రాదు అన్నదానిపై చాలామందికి అవగాహన లేదు. ఎవరైనా రాజకీయ నాయకుడు లేదా వ్యక్తి సామర్థ్యం, పనితీరుపై ఒక అభిప్రాయాన్ని వ్యక్తీకరించే హక్కు ప్రతి రచయితకూ ఉంటుంది. అది అతని వ్యక్తిగత అభిప్రాయం. దాన్ని సామాన్య ప్రజలు ఎలా అర్థం చేసుకున్నా, అవతలి వారికి పరువు నష్టం కలగదు. న్యాయాధికారి ఒక వ్యక్తిని గాని, తల్లిదండ్రులు పిల్లలను గాని, గురువు శిష్యుణ్ని గాని, యజమాని తన ఉద్యోగిని గానీ సదుద్దేశంతో తప్పుబట్టినా... వారి తప్పొప్పులను పదిమంది ముందు ఎండగట్టినా అది నేరం కిందకు రాదు. పరువు నష్టం (క్రిమినల్ డిఫమేషన్) కేసులో నేరం నిరూపితమైతే రెండు సంవత్సరాల సాధారణ జైలు జీవితం గడపాల్సి రావచ్చు. సంబంధిత వ్యక్తికి కోర్టు జరిమానా విధించవచ్చు. జైలు శిక్ష, జరిమానాలతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలలో పాల్గొనమని ఆదేశించవచ్చు.ఏతావాతా భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన రెండు పార్శ్వాలు మన దేశంలో నిత్యం పొడచూపుతూనే ఉన్నాయి. తప్పుడు క్రిమినల్ కేసులు బనాయించి, ఆ ప్రాథమిక హక్కును హరించడానికి జరుగుతున్న ప్రయత్నాలు మొదటి పార్శ్వం. ఇలాంటి కేసుల వల్ల ప్రజలు తమకున్న తెలుసుకునే హక్కును కోల్పోతున్నారు. అలాగే, అవినీతి అక్రమాలను బయటపెట్టడానికి పాత్రికేయులు ప్రతిరోజూ సవాళ్లు ఎదుర్కొంటున్నారు. భావప్రకటన స్వేచ్ఛకు ప్రాణాధారమైనవి... తర్కం, విమర్శ. అధికారంలో ఉన్నవారిని గాడిలో పెట్టడానికి విమర్శ ఉపయోగపడుతుంది. విమర్శకులు లేకపోతే పాలకులకు అధికారం తలకెక్కి ప్రజల హక్కులను కాలరాసే ప్రమాదం ఉంది. కాబట్టి, భావప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవడం ప్రజాస్వామ్యంలో తప్పనిసరి అవసరం. మన దేశంలో పలువురు కార్టూనిస్టులు తమ సునిశిత వ్యంగ్య చిత్రాలతో ఎంతోమంది రాజకీయ నాయకుల తప్పొప్పులను ప్రజలకు తెలియజేశారు. వారి కార్టూన్లను సమాజం మొత్తం హర్షించింది. వాటివల్ల సంఘానికి చాలా మేలు జరిగింది. విమర్శలను సహించే అలాంటి వాతావరణం ఇప్పుడు కొరవడుతోంది. ప్రజాప్రయోజనాల పరిరక్షణకు విమర్శనాత్మక కథనాలను ప్రచురించే మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకునే పెడపోకడలు పెరుగుతున్నాయి. స్వేచ్ఛా సమాజానికి ఇది అంత మంచిది కాదు. వ్యక్తిగత అభిప్రాయాలను పరస్పరం గౌరవించుకునే సమాజమే అత్యుత్తమమైనది. ఆ సుగుణం లోపించిన సమాజం తిరోగమనంలో ఉన్నట్లే లెక్క. అమెరికాలో అధ్యక్షుణ్ని ఎంత గట్టిగా అయినా విమర్శించవచ్చు, ఎగతాళి చేయవచ్చు. జిమ్మీ కిమ్మెల్ అనే టీవీ హోస్ట్, ట్రంప్ వ్యవహారశైలిని ప్రతిరోజూ ఉతికి ఆరేస్తున్నారు. కిమ్మెల్ విమర్శలను అక్కడివారు సహృదయంతో స్వీకరిస్తున్నారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు అలాంటి ఓర్పు, విచక్షణ, విజ్ఞత ప్రదర్శించాలి. అప్పుడే ప్రజలు పరిపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించగలరు.

### అసత్య ప్రచారాలను అరికట్టాలి

భావప్రకటనా స్వేచ్ఛకు ఇంకో పార్శ్వం ఉంది. అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైంది. దురుద్దేశపూరిత తప్పుడు వార్తలు, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు ఇప్పుడు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఇంటర్నెట్ విప్లవానికి విషపుత్రికలుగా పుట్టుకొచ్చిన ఇవి వ్యక్తులూ సంస్థల పరువుప్రతిష్ఠలను మంటగలుపుతున్నాయి. జనవర్గాల నడుమ వైషమ్యాలను పెంచుతూ అవి సామాజిక కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి. ఇలాంటి నకిలీ వార్తలను, పోస్టులను సరైన కేంద్ర చట్టం ద్వారా నియంత్రించాలి. 19(2) రాజ్యాంగ అధికరణ నిర్దేశించిన పరిమితులు తప్ప భావప్రకటన స్వేచ్ఛపై కొత్త నియంత్రణలు పెట్టకూడదని సుబ్రమణియన్ స్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కానీ– నకిలీ వార్తలను, సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననాలను నిరోధించడానికి చట్టసభలకు ఎలాంటి అడ్డంకులూ లేవు.

# నా సెగ్మెంట్‌లో నీకేం పని.. బండిపై రగిలిపోతున్న ఈటల

హైదరాబాద్,బీజేపీ కీలకమైన పదవులలో ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయా?.. ఒకే పార్టీలో ఉన్నా వేర్వేరు నియోజకవర్గాల నుండి ఎంపీలుగా ఉన్నా వారిద్దరూ ఒకే జిల్లాకి చెందినవారు కావడంతో ఇప్పుడు ఆ పార్లమెంటు పరిధిలోని ఓ అసెంబ్లీ నియోజకవర్గం లో మాత్రం వారు రెండు గ్రూపులు గా విడిపోయారట. ఇప్పటికే పార్టీ పదవుల పంపకాలలో తేడాలు రాగా ఇప్పుడు ఈటలకు స్థానికసంస్థల ఫివర్ పట్టుకుందట .నీ సెగ్మెంట్ నువ్వు చూసుకో.. నా సెగ్మెంట్ లో నీకేం పని అని ఆయన బండి గాలి తీస్తున్నారంట.. తనని నమ్ముకున్న వాళ్ళని అవసరం అయితే వేరేపార్టీ భీఫాంలు ఇచ్చి అయినా గెలిపించుకుంటా నని ఈటల వార్నింగ్ ఇస్తున్నాంట.. ఇప్పుడు ఇవే వ్యాఖ్యలు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు లు చేసేదాక పోయిందంట..

### బండి సజయ్, ఈటల మధ్య తారాస్థాయికి చేరిన విభేదాలు

తెలంగాణ బీజేపీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ పార్టీ నుండి కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపిగా ఉన్న ఈటల రాజేందర్ ల మధ్య విభేధాలు ఇప్పుడు తారాస్థాయికి చేరుకున్నాయి. హుజురాబాద్ పార్టీ నేతల విషయంలో మొదలైనా వివాదం రోజురోజుకు ముదురిపోతుందనే చర్చ నడుస్తోందట. కొంతకాలంగా వీరిద్దరి మధ్య వర్గపోరు నడుస్తుండగా.. ఇద్దరి మధ్య పేర్లు ప్రపస్తావించకుండానే డైలాగ్ వార్‌కి దిగారట. ఇప్పుడు స్థానిక సంస్థలు దగ్గర పడుతున్నా వేళ మరోకసారి విభేదాలు భగ్గుమంటున్నాయి. బీజేపీలో ఉన్నది ఒక్కటే మోడీ గ్రూపు పదేపదే చెబుతున్నాగాని హుజురాబాద్ నియోజకవర్గం లో మాత్రం బండిసంజయ్,ఈటల రాజేందర్ వర్గాలుగా విడిపోయాయి. అయితే ఇప్పుడు అదే వర్గపోరు ఈటల రాజేందర్ కి కంటిమీద కునుకు లేకుండా చేస్తుందట. తనని వెంబడి నడిచిన తన అనుచరులకి విలువలేకుండా పోతుందోనని ఈటల నిత్యం అగ్రహావేశాలతో రగిలిపోతున్నాడట.

### హుజూరాబాద్ నుంచి వరుస విజయాలు సాధించిన ఈటల

ఈటల రాజేందర్ మల్కాజిగిరి ఎంపిగా ఉన్నాగాని హుజురాబాద్ నియోజకవర్గానికి ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది%ొ% అక్కడి నుండి వరుస విజయాలతో గులాబీ పార్టీ నుంచి ఉండి, రెండు సార్లు మంత్రిగా పనిచేసి విభేదాల కారణంగా బీజేపీలో చేరి కాషాయకండువా కప్పుకొన్నారు. ఉప ఎన్నికలలో కేసీఆర్‌తో సై అంటే సై అని ఘన విజయం సాధించారు. కాని తరువాత జరిగిన పరిణామాలతో హుజురాబాద్ ఎన్నికలలో ఓడిపోవడం ,మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసి ఎంపిగా గెలవడం జరిగిపోయాయి..అయితే శాసనసభ హుజురాబాద్ ఓడిపొయాక చాలరోజుల వరకూ హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలమీద,నాయకుల మీద కీనుక వహించి చాలరోజులు హుజురాబాద్ కి దూరంగా ఉండిపోయాడు. కానీ తాను బీజేపీలో విజయం సాధించారు.

### ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్‌కు హుజూరాబాద్‌లో మంచి మెజారిటీ

తన హయాంలో కిందస్థాయి క్యాడర్ బలంగా తయ్యారయ్యిందని. ఎంపిగా బండిసంజయ్ గెలుపులో కరీంనగర్ పార్లమెంటు పరిధిలో హుజురాబాద్ నియోజకవర్గంలో ఎక్కువ మెజారిటి వచ్చిందనేది ఈటల అభిప్రాయపడుతున్నారు. కానీ జిల్లా, మండల కమిటీల నియామకం లో ఈటల రాజేందర్ అనుచరులకి ప్రాతినిధ్యం దక్కకపోవడంతో అప్పట్లో చాలా ఘాటుగానే విమర్శలు చేశారు. తాజాగా భారతీయ జనతా పార్టీలో విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై తాజాగా




హుజురాబాద్ పార్టీ శ్రేణులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసారు. శామీర్‌పేటలోని ఈటీల నివాసం వద్ద వారు చేసిన వ్యాఖ్యల దుమారం ఇంకా సద్దుమణగలేదు.

### ఫార్వర్డ్ బ్లాక్ టికెట్లు ఇప్పిస్తానని అనుచరులకు ఈటల హామీ

అయితే దసరా పండుగకి కమలాపూర్ లోని ఇంటికి వచ్చిన ఈటల రాజేందర్ వద్ద ఆయన అనుచరులు స్థానికసంస్థల ఎన్నికల ప్రస్తావన తీసుకువచ్చారట .టికెట్ రాకపోతే ఎవ్వరూ బాధపడవద్దని అవసరమైతే అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లాంటి పార్టీనుండి టికెట్ ఇప్పించి గెలిపించుకుంటానని హామీఇవ్వడం ఇప్పుడు కమలంపార్టీలో కలకలం రేపుతోందంట. జాతీయపార్టీ బీజేపీలో ఉంటూ మరో పార్టీ నుండి టికెట్ ఇప్పిస్తానని ఎలా హామి ఇస్తాడని హుజురాబాద్ బీజేపి క్యాడర్ మండిపడుతున్నా రట. కొత్త నాయకులు, పాత నాయకులు అంటూ అ వర్గం, ఈ వర్గం అంటూ విభజిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేస్తున్నారట.

### ఇతర పార్టీ టికెట్ ఎలా ఇప్పిస్తానంటారని అసంతృప్తి

పార్టీ నిర్ణయాలకి కట్టుబడి ఉండక వి, ఇతర పార్టీ టికెట్ ఎలా ఇప్పిస్తానంటారని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నరట. హుజురాబాద్ లో ఉంది బీజేపీ పార్టీనేనని..ఈటల.వ్యక్తిగత దుకాణం కాదని చర్చించుకుంటున్నారట. అయితే ఈటల వ్యాఖ్యలని సిరియస్ గా తీసుకున్న కరీంనగర్ బిజేపి అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో పాటుగా మరికొంత నాయకులు రాష్ట్ర అధ్యక్షుడుని కలిసి తమ అవేదనని తెలియజేశారట. హుజురాబాద్ నియోజకవర్గం బీజేపీలో విభేదాలు సృష్టిస్తూ పార్టీని బలహీన పరుస్తున్నారని , వ్యక్తిగతంగా అనుచరులని ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదు చేశారంట.. అంతర్గత విభేదాలు ఇలాగే కొనసాగితేఈటల ప్రవర్తన వలన పార్టీకి ముప్పు వాటిల్లుతుందని ఆయన్ని కట్టడి చేయాలని కోరారంట.గతంలోకంటే ఇప్పుడు కరీంనగర్ పార్లమెంటు సెగ్మెంట్ లో బిజెపి ఇప్పుడు బలం పెరుగుతోంది.. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఇప్పుడు కేంద్రమంత్రి అయ్యాక గ్రామాలలో క్రిందిస్థాయినుండి పార్టీని బలంగా నిర్మాణం చేసారనేది సంజయ్ వర్గీయులు చెబుతున్న మాట. ఇప్పుడు స్థానికసంస్థల ఎన్నికలలో మెజారిటీ స్థానాలని కైవసం చేసుకోవాలని ,అసెంబ్లీ ఎన్నికల నాటికి తన పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పార్టీని బలంగా తయ్యారు చెయ్యాలని బండిసంజయ్ గ్రౌండు వర్క్ చేస్తుండగా..ఈటల మార్క్ రాజకీయాల కారణంగా పార్టీ ఇబ్బందులలో పడుతుందని సంజయ్ వర్గీయులు అంటున్నారంట. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతికూల ఫలితాలు తప్పదని హెచ్చరిస్తున్నారట. ఆ క్రమంలో ఇప్పుడు ఈటల రాజేందర్ పై వస్తున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో రాజకీయా వర్గాలలో హాట్ టాఫిక్ గా మారింది.

# భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

న్యూఢిల్లీ, ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వరించింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్ ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు జాన్ క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ మార్టినిస్‌లకు 2025 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చినట్లు మంగళవారం నోబెల్ కమిటి తెలిపింది. జాన్‌క్లార్క్, మిచెల్‌హెచ్.డివోరెట్, జాన్.ఎం మార్టిన్స్‌లు ముగ్గురు ఈ అవార్డను సంయుక్తంగా గెలుచుకున్నారు. నోబెల్ భౌతిక శాస్త్ర బహుమతిని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. బహుమతి గెలుచుకున్న ముగ్గురికి మొత్తం 11 మిలియన్ స్వీడిష్ కిరీటాల (శ్రీ1.2 మిలియన్లు) బహుమతి రానుంది. ఈ మొత్తాన్ని వాళ్లు ముగ్గురు పంచుకోనున్నారు. ఇప్పటికే తొలి నోబెల్ బహుమతి వైద్య రంగంలో ముగ్గురు వైద్యులకు సంయుక్తంగా లభించింది. మిగిలిన విభాగాల్లో నోబెల్ బహుమతుల విజేతల పేర్లను అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రకటించనున్నారు.ప్రముఖ వ్యాపారవేత్త, శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణం తరువాత ఈ నోబెల్ బహుమతులు అందజేస్తున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన సంపదలో ఎక్కువ భాగాన్ని వివిధ రంగాలలో బహుమతులను అందజేయడానికి వీలునామా రాశారు. 1895 నాటి ఆయన వీలునామా ప్రకారం.. గత ఏడాదిలో, మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చిన వారికి బహుమతులు ప్రదానం చేయాలని ఆయన నిర్దేశిరచారు. ప్రతి ఏడాది డిసెంబర్ 10న నోబెల్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజు ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి. ఈ రోజున నోబెల్ బహుమతులు గ్రహీతలకు ప్రదానం చేస్తారు. మొదటి నోబెల్ బహుమతులు 1901లో ప్రదానం చేశారు. నాటి నుంచి ఏటా అందజేస్తున్నారు. అప్పటి నుంచి కొన్ని సార్లు నోబెల్ బహుమతులు ఇవ్వని సందర్భాలు కూడా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకు కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.

# అర్థాలు ఎన్నో ?

అమరావతి,జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనంగా ఉంటున్నారు. అది ఇటీవల ఒకటి రెండు బహిరంగ కార్యక్రమాలలో వెల్లడైంది. మంత్రివర్గ సమావేశంలో ముభావంగా ఉన్న పవన్ తాజాగా విజయవాడలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభ కార్యక్రమంలో మౌనంగానే వ్యవహరించారు. ఆయన తన ప్రసంగంలో సహజ శైలికి భిన్నంగా నెమ్మదిగానే మాట్లాడారు. అంతే కాదు క్లుప్తంగా ముగించేశారు. తన మనోభావాలు ఏమిటి అన్నది వ్యక్తం చేయకుండానే జాగ్రత్త పడ్డారు అని అంటున్నారు.

### నేల చూపులతోనే అంతా :

అయితే చంద్రబాబు లోకేష్ మాట్లాడినపుడు మాత్రం ఏ దశలోనూ పవన్ తల ఎత్తి చూడలేదు. పూర్తి మౌనంతో నేల చూపులే చూస్తూ ఉండిపోయారు. ఆయనను చంద్రబాబు పొగిడారు. ఓజీ సినిమా చూశారా అని ఆటో డ్రైవర్లను అడిగి మరీ పవన్ ని హుషారు చేయాలని చూశారు ఇక లోకేష్ తన ప్రసంగంలో పవన్ అన్న అంటూ సంభోదిస్తూ ప్రసంగించారు. ఇలా బాబు లోకేష్ పవన్ గురించి బాగా మాట్లాడినా ప్రశంసించినా ఆయన మాత్రం తల ఎత్తి చూడలేదు సరికదా నేల చూపులే చూస్తూ ఇబ్బందిగా కదులుతూ గడిపారు అని అంటున్నారు. ఇదంతా టీవీలలో మొత్తం లైవ్ లో టెలికాస్ట్ అయినపుడు అంతా చూశారు. ఆ తరువాత కూడా వీడియోలలో ఉంది.

### అసెంబ్లీ ఎపిసోడ్ తోనే :

అయితే పవన్ ఈ విధంగా మౌనం వహించడం అంతా అసెంబ్లీలో బాలయ్య ఎపిసోడ్ తోనే జరిగింది అని అంటున్నారు. తాను ప్రాణప్రదంగా ఆరాధించే తండ్రి సమానునిగా చూసే మెగాస్టార్ చిరంజీవి విషయంలో బాలయ్య అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు అని అంటున్నారు. అంతే కాదు అసెంబ్లీలో బాలయ్య వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. చంద్రబాబు స్వయంగా వచ్చి హైదరాబాద్ లోని పవన్ నివాసంలో ఆయనను పరామర్శించారు. అయినా సరే పవన్ లో మాత్రం ఆగ్రహం చల్లారడం లేదని అంటున్నారు. దానికి కారణం బాలయ్య చేత కనీస వివరణ ఇప్పించే ప్రయత్నం టీడీపీ అధినాయకత్వం చేయకపోవడమే అని అంటున్నారు.

### పంటి బిగువున భరిస్తూ :

ఇదిలా ఉంటే పవన్ తన మనో వేదనను కొందరు సన్నిహితులతో పంచుకున్నట్లుగా చెబుతున్నారు. తాను పంటి బిగువున అన్ని భరిస్తున్నాను అని ఆయన అన్నట్లుగా చెబుతున్నారు. కూటమి ఐక్యత కోసం అలాగే మరోసారి జగన్ అధికారంలోకి రాకుండా చూడడం కోసం తాను అన్నీ తగ్గి అడుగులు వేస్తూంటే దానికి టీడీపీకి చెందిన వారు కొందరు తేలికగా తీసుకుంటున్నారని పవన్ తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లుగా ప్రచారం సాగుతోంది. రాష్ట్రం ముఖ్యమనుకుని తాను దేనినీ పట్టించుకోవడం లేదని ఆయన అన్నట్లుగా చెబుతున్నారు.

### మంచితనానికి ఫలితం :

తాను మంచితనంగా ఉంటే అది చేతగానితనంగా చూస్తున్నారా అన్న బాధ ఆగ్రహం కూడా ఆయనలో వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. తన మంచితనం తనకూ పార్టీకి శాపంగా మారుతోందా అన్న ఆవేదన కూడా ఆయన వ్యక్తం చేశారని అంటున్నారు. పదవుల దగ్గర నుంచి ఏ విషయంలోనూ తాను ఎపుడూ డిమాండ్ చేయకుండా సర్దుకునిపోతున్నా కూడా ఈ రకమైన స్పందన రావడమేంటి అని ఆయన వాపోతున్నారని అంటున్నారు.

### అక్కడ టీడీపీనే :

ఇక తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో కూడా టీడీపీనే ఎదురు నిలిచి ఇబ్బందులు పెడుతోంది అన్నది కూడా ఆయన ఆవేదనగా ఉంది అంటున్నారు. వైసీపీ కంటే టీడీపీతోనే అక్కడ పోరాడాల్సి వస్తోంది అని జనసేన నేతలు చెబుతున్నారని అంటున్నారు. ఇలా పవన్ అయితే నిర్వేదంతో ఉన్నారని అంటున్నారు. ఆయనలో దాగిన ఈ ఆవేదన తగిన సమయంలో బయటపడి బద్ధలవుతుందా లేక ఈ లోగా కూటమిలో సర్దుబాట్లూ దిద్దుబాట్లూ జరుగుతాయా అన్నది అయితే చర్చగా ఉంది.

# 60కోట్ల మోసం కేసులో విచారణ

ముంబై,ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి.ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది.

## బంగారం ధరలు మరింత ప్రియం

హైదరాబాద్,బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. క్రమంగా రోజురోజుకు పెరుగుతూ లక్షన్నరకు చేరువగా పరుగులు తీస్తోంది. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,23,850కి చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,11,500గా ఉంది. వెండి కిలో రూ.1,54,350కి చేరింది. సోమవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,460 ఉండగా.. మంగళవారం మరో రూ.390 పెరిగింది. కిలో వెండి ధర రూ.1,54,200 ఉండగా.. తాజాగా మరో రూ.150 పెరిగి రూ.1,54,350కి చేరింది. అమెరికా షట్‌డౌన్ కొనసాగడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ఈ ఏడాదిలో మరింత తగ్గిస్తుందనే అంచనాల నేపథ్యంలో ఇన్వెస్టర్ల తమ నిధులను బంగారం, వెండిపైకి మళ్లించడం ఈ పరిస్థితికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు

హైదరాబాద్,జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అయ్యింది. మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి నవీన్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి చర్యగా భావించిన ఎన్నికల సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నవీన్ యాదవ్ మీద బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు అయ్యింది. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనల మీద అధికారుల సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అవ్వడం కాంగ్రెస్‌కు భారీ దెబ్బగా చెప్పుకోవచ్చు. నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా అనుకున్నట్లు రాజకీయా వర్గాల్లో వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్‌పై కేసు నమోదు అవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాజాగా.. ఎన్నికల సంఘంకు ఎంపీ రఘునందన్ రావు, నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులు అందజేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ఎన్నికల సంఘం.. నవీన్ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి షాక్

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టను ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

## ఓవర్ కాన్ఫిడెన్సా ?

హైదరాబాద్,తెలంగాణలో బీజేపీ ఒక పొలిటికల్ స్టాండ్ అయితే తీసుకుంది అని అంటున్నారు. ఎన్నిక ఏదైతే కానీ. తాము ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ధారించుకుంది. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా సింగిల్ గా పోటీ చేస్తే ఎదగవచ్చు అన్నది ఆ పార్టీ భారీ వ్యూహంగా ఉంది. గత పదేళ్ళుగా బీజేపీ రాజకీయ విధానం ఈ విధంగానే ఉంది. ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో అదే తీరున ముందుకు సాగుతోంది అని అంటున్నారు.

ఆల్టర్నేషన్ కావాలనే :

తెలంగాణాలో ప్రస్తుతం చూస్తే రాజకీయం మూడు ముక్కలుగా ఉంది. అధికార కాంగ్రెస్ ఒక వైపు బీఆర్ఎస్ మరో వైపు బీజేపీ ఇంకో వైపు ఉన్నాయి. అయితే చిత్రమేంటి అంటే రెండు జాతీయ పార్టీల మధ్య ఒక ప్రాంతీయ పార్టీగా బీఆర్ ఎస్ ఉంది. జాతీయ పార్టీతో పోరాడే శక్తి మరో జాతీయ పార్టీకే ఉంటుందని బీజేపీ 2024 ఎన్నికల్లో జనాలకు చెప్పగలిగింది. ఫలితంగా కాంగ్రెస్ ఎనిమిది బీజేపీ ఎనిమిది ఎంపీ సీట్లను గెలుచుకున్నాయి. బీఆర్ఎస్ కి ఒక్క సీటు కూడా దక్కలేదు అంతకు ముందు 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాతిక సీట్లు వస్తాయనుకుని బరిలోకి దిగితే ఎనిమిది మాత్రమే వచ్చాయి. అయితే చాలా చోట్ల రెండవ మూడవ స్థానంలో బాగానే ఓట్లు సంపాదించి కమలం పార్టీ బాగానే రాణించింది.

ఫ్లాష్ బ్యాక్ ని చూసి :

ఇక 2014లో చూస్తే ఉమ్మడి ఏపీగానే ఉండగా సార్వత్రిక ఎన్నికలు జమిలిగా సాగాయి. అయితే ఆనాడు బీజేపీ మంచి సీట్లనే టీడీపీతో పొత్తుతో సాధించింది. కానీ ఆ తరువాత మాత్రం తెలంగాణాలో రాజకీయం మారింది. టీడీపీని ఆంధ్రా పార్టీగా ముద్ర వేసి బీఆర్ఎస్ గురి పెట్టింది. దాంతో 2018 నాటికల్లా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు మాత్రమే దక్కింది. కానీ ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు సాధించి తన బలాన్ని పెంచుకుంది అంతే కాదు హైదరాబాద్ కార్పోరేషన్ ఎన్నికల్లో కూడా తన సత్తా చాటింది. ఇవన్నీ కూడా 2023, 2024 ఎన్నికల్లో ప్రతిఫలించి కమలానికి కొత్త వెలుగులు అందించాయి.

నో దోస్తీ అంటూనే :

ఇక ఏపీలో చూస్తే టీడీపీ జనసేన బీజేపీ కూటమి కట్టాయి. అధికారంలోకి వచ్చాయి. ఏపీలో బీజేపీ గ్రాఫ్ అయితే ఎక్కడా పెరగడం లేదు. పొత్తు ఉంటేనే గెలుస్తోంది. లేకపోతే డిపాజిట్లు కూడా రావడం లేదు. దాంతో బీజేపీ ఏపీ వరకూ పొత్తుల బాటనే ఎంచుకుంది.

# టీడీపీ-జనసేనల మధ్య దూరం పెరుగుతుందా?



అమరావతి,గత కొంత కాలంగా టీడీపీ- జనసేన సంబంధాల్లో చిన్నచిన్న ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల పంపిణీ దామాషా ప్రకారం జరగటం లేదని మొదట జనసేన కార్యకర్తలు ఆరోపించినప్పుడు, పొత్తులో అలాంటివి సహజమేనని కొట్టిపారేయటం జరిగింది. కానీ, ఇటీవల అసెంబ్లీలో జనసేనకు సంబంధించిన మంత్రుల మీద కొందరు టీడీపీ శాసన సభ్యులు చేసిన ప్రత్యక్ష విమర్శలు, సమస్య చిన్నది కాదేమోననే అనుమానానికి తావిచ్చాయి.తాజాగా మాజీ కేంద్రమంత్రి చిరంజీవి కేంద్రంగా అసెంబ్లీలో జరిగిన వివాదాస్పద చర్చలతో ఆ రెండు పార్టీల మధ్య దూరం పెరుగుతున్నట్టుగా ప్రజలు చర్చికుంటున్నారు. దీన్ని జనసేనకు వ్యతిరేకంగా టీడీపీ మొదటి ట్రయల్ రన్‌గా కొందరు భావిస్తున్నారు. కూటమి మద్దతుదారులకు ఇది కొంత ఇబ్బందికరంగా మారింది.అయితే కూటమిలోని వారే కొందరు అధికారపక్షం గానూ, మరికొందరు ప్రతిపక్షంగానూ ద్విపాత్రాభినయం చెయ్యటం సంకీర్ణ రాజకీయాల్లో కొత్తకాదనే విశ్లేషణలు కూడా వస్తున్నాయి.ఏదిఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంచలనంగా మారిన ఈ పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ఒక దృక్పథం కావాలి.

చిన్న విషయాలే పొత్తులను దెబ్బతీస్తాయి..

దేశంలో ఏక పార్టీ ఆధిపత్యం కొనసాగినంత కాలం పొత్తుల అవసరం ఏర్పడలేదు. కాలక్రమంలో ఏక పార్టీ ఆధిపత్యం పతనమై ఏ ఒక్క పార్టీకి ప్రభుత్వ స్థాపనకు సరిపోయే మెజారిటీ రానందు వల్ల సంకీర్ణ రాజకీయాలు మొదలయ్యాయి. ఈ కొత్త పద్ధతి చిన్న పార్టీల ప్రాధాన్యతని పెంచి, వాటికి కూడా ప్రభుత్వ భాగస్వామ్యంలో అవకాశాన్ని కల్పించింది. ఇది ప్రజాస్వామ్య పరిధిని విస్తరింపజేసిందనటంలో సందేహం లేదు.ఇది అంతే స్థాయిలో భాగస్వామ్య పక్షాల్లో ఒకరిపట్ల ఒకరికి అనుమానాలు, అసమ్మతులు, అస్థిరతలు కూడా పెంచిందని చెప్పవచ్చు.సంకీర్ణ రాజకీయాల తొలి దశలో బాగస్వాముల మధ్య చిన్నచిన్న సమస్యలు కూడా ఒక్కోసారి పొత్తుల్ని భగ్నం చేసేవి. జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు మధ్యలోనే కూలిపోవటం ఇందులో భాగంగానే చూడాలి.అయితే కాలక్రమంలో సంకీర్ణ రాజకీయాలు పరిణతి చెందాయి. పొత్తు అవసరం లేకుండా సొంతగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే శక్తి వున్న పార్టీలు కూడా ఇతర పార్టీలని కలుపుకునిపోయే పద్ధతి మొదలైంది. ఆ విధంగా గెలుపు, ఓటములకు అతీతంగా దేశంలో రాజకీయ పార్టీలు రెండు కూటములుగా విడిపోవటం మొదలైంది. ఒకే కూటమిలోని పార్టీలు అన్నీ సాధారణంగా ఎన్నికల్లో కలిసి పోటీ చేసే వాతావరణం ఏర్పడింది.ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలిచినా పార్టీ ఆధిపత్యం ప్రత్యక్షంగా కొనసాగుతూనే ఉంది. ఇందువల్ల ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన మధ్య స్థాయి, చిన్న పార్టీలు కొన్నిసార్లు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఒకసారి పునరావలోకనం చేసుకుంటే అధికారంలోకి వచ్చాక కూటముల్లోని పెద్ద పార్టీల పెత్తనం, ఒంటెత్తు పోకడులు పెరిగిపోతున్నాయి.సంకీర్ణ ప్రభుత్వాల మూలసూత్రాలు విస్మరణకు గురవుతున్నాయి. పొత్తుల వల్ల రాజకీయ సంబంధాల్లో అనేక మార్పులు వస్తాయి. అప్పటి వరకు కత్తులు దూసుకున్న ప్రత్యర్థి పార్టీలు ఒకరినొకరు సమర్థించుకుంటూ కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఈ కారణం వల్లే రాజకీయాల్లో శాశ్వత ప్రయోజనాలు తప్ప శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడి వచ్చింది.ప్రధాన పార్టీలు ఎలాగూ కలిసే అవకాశం ఉండదు. అవి నిరంతరం కత్తులు దూసుకుంటూ ఒకరిపైఒకరు ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తూ ఉంటాయి. మధ్యస్థాయి పార్టీలు మాత్రం ఏ పార్టీతోను తెగేవరకు లాగకుండా పరిస్థితుల్ని బట్టి సున్నితంగా వ్యవహరిస్తూ ఉంటాయి. బహుళ పార్టీ రాజకీయ వ్యవస్థలలో మధ్యస్థాయి పార్టీలకు ప్రాధాన్యత క్రమంగా పెరుగుతూ వస్తుంది. అందుకే ప్రధాన పార్టీలు ఎప్పటికప్పుడు ఆ పార్టీలతో పొత్తు వ్యూహాలు పన్నుతూ ఉంటాయి.ప్రత్యర్థిని అధికారంలోకి రాకుండా చెయ్యటానికి పెద్ద పార్టీలు కొన్నిసార్లు మధ్యస్థాయి పార్టీల నాయకులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసి వస్తుంది కూడా. ఆ పార్టీల నాయకులకు ప్రధాని, ముఖ్యమంత్రి పదవులిచ్చి పక్కన కూర్చున్న సందర్భాలు దేశంలో అనేకం ఉన్నాయి.ఆ విధంగా ఇచ్చిపుచ్చుకోవటం, సర్దుకుపోవటం, పరస్పర సహకారం, చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవటం, దిద్దుబాట్లు చేసుకోవటం. అవసరమైతే మధ్య స్థాయి పార్టీలకి అధికారంలో ఎక్కువ షేర్ ఇవ్వటం పొత్తు రాజకీయాల్లో బేసిక్ గ్రామర్‌గా మారిపోయింది.ఈ సర్దుబాట్లు సాధారణంగా పెద్ద భాగాస్వాములకు ఇష్టం వుండదు. అయినా ఎన్నికల్లో వారి సపోర్ట్ కోసం సర్దుకు పోతారు.ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పొత్తు రాజకీయాలని పరిశీలిస్తే అనేక సార్లు రాష్ట్రాన్ని సంకీర్ణ ప్రభుత్వాలు పాలించాయి. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబునాయుడు సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించారు. అయితే, అవి చాలా సింపుల్ సంకీర్ణాలు. ప్రస్తుతం కూడా టీడీపీ- జనసేన- బీజేపీ మధ్య పొత్తుతో ఎన్డీఏ పొత్తు ప్రభుత్వమే నడుస్తుంది. రాష్ట్రాన్ని ఎన్డీఏ కూటమి పాలించటం ఇది రెండోసారి. ఈ రెండు సార్లు జనసేన పొత్తు ఆ కూటమి విజయంలో కీలక పాత్ర వహించింది. ఈ సారి గత పొత్తుల్లాగా కాకుండా జనసేన పొత్తు కూటమిలో అత్యంత కీలక పాత్ర పోషించింది.అయితే ముఖ్యంగా టీడీపీ- జనసేన రెండు పార్టీలు ఒకరికొకరు పూరకమనేది గుర్తించాలి. ఈ ఇద్దరు కలవకపోతే ఇద్దరూ ఓడిపోయేవారని జాతీయ మీడియాలో కూడా చర్చలు జరిగాయి. 2014 పొత్తులో ఉన్నప్పటికీ జనసేన అధికారంలో భాగం తీసుకోలేదు. కానీ 2024లో అధికారంలో భాగస్వామి అయ్యింది.అప్పటి నుంచి ఈ రెండు పార్టీల మధ్య చిన్నాచితక ఒడిదుడుకులు వస్తూపోతూ ఉన్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకులు జనసేన కార్యకర్తలకు సరైన ప్రాధాన్యత ఇవ్వటంలేదని కొందరు జనసేన నాయకులూ బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.అందులో కొంత నిజం లేక పోలేదు. రేషన్ షాపులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సహకార సంఘాల చైర్మన్లు, యానిమేటర్లు, ఇరిగేషన్‌లో లష్కర్ ఇతర పదవుల నియామకాల్లో దామాషాలో వారికి ప్రాధాన్యత దక్కటంలేదని జనసేన కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.పదవుల్లో ఎంతోకొంత షేర్ వస్తున్నప్పటికీ, రావల్సినంత రావటల్లేదని ప్రధాన ఆరోపణ. అదేవిధంగా అసెంబ్లీలో టీడీపీ శాసన సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని పర్యావరణ మంత్రిత్వ శాఖపై చేసిన వ్యాఖ్యలు కూటమిలో కొంత గందరగోళాన్ని సృష్టించాయి. తరువాత పౌర సరఫరాశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మీద శాసన సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపణలు ఆ కన్ఫ్యూజన్‌ని మరింత పెంచాయి. దీంతో కూటమిలో రెండు పార్టీల మధ్య ఏదో జరుగుతుందనే వాతావరణం రాష్ట్రంలో పెరిగిపోయింది.అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవలిసిన సమస్యలు అసెంబ్లీ దాక రావటం పరిశీలకుల్ని ఆశ్చర్య పరిచింది. ఇది యాదృశ్చికంగా జరిగినట్టు ఎవరు భావించటం లేదు. టీడీపీ పెద్దల అనుమతితోనే జరిగి ఉంటుందని సోషల్ మీడియాలో పుంఖానుపుంఖాలుగా వడ్డించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అనుమతిలేకుండా టీడీపీ శాసనసభ్యులు అంత ధైర్యం చెయ్యరని చర్చోపచర్చలు జరిగాయి.కారణం ఏదైనా కూటమిని సమర్థించే వారికి షాక్‌కు గురిచేసింది. అదేవిధంగా అసెంబ్లీలో మాజీ కేంద్రమంత్రి చిరంజీవిని ఉద్దేశించి శాసన సభ్యుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల్లోనూ పెద్ద గందరగోళాన్ని సృష్టించాయి. ప్రశాంతంగా నడుస్తున్న కూటమి ప్రయాణాన్ని ఆ వ్యాఖ్యలు ఒక్క కుదుపుకుదిపాయి. చిరంజీవి లేఖ రాయవలిసిన అనివార్య పరిస్థితులని కల్పించాయి. ఆ వ్యాఖ్యలతో కూటమిలో ఏదో కుంపటి రగులుతుందని ప్రజలు భావించారు.నిజానికి బాలకృష్ణ వ్యాఖ్యలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆమోదించలేదు. చిరంజీవి సోదరులు ఈ విషయంలో సంయనం పాటించినట్టు అర్ధమవుతుంది. ఒక పెద్ద మేలు కోసం కొన్ని చిన్నచిన్న ఇబ్బందులను చూసీచూడనట్టు వదిలెయ్యటం పొత్తు రాజకీయాల్లో సహజమే, తప్పదు. ఇప్పుడు పవన్ కళ్యాణ్, నాగబాబు సంయమనం పాటించటం భవిష్యత్తులో కూటమికి ఒక ప్రమాదాన్ని నిలవరించిందని చెప్పవచ్చు. వారి మౌనం జనసైనికుల నోళ్ళను కట్టేసింది.ఈ వేడి వాతావరణంలోనే పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి కలవటం కూటమికి కొంత సాంత్వనను చేకూర్చింది. అయన పవన్ కళ్యాణ్‌ని కలిసింది బాలకృష్ణ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పటానికే అని సోషల్ మీడియా వ్యాఖ్యానించింది.కారణం ఏదైనా అది ఒక మంచి పరిణామమే.

# 'సనాతన' ఉన్మాదం...

న్యూఢిల్లీ,దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై సనాతనధర్మోన్మాదం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన అత్యంత ఆందోళనకర ఘటన ప్రస్తుతం దేశంలో నెలకొన్న దుస్థితిని తెలుపుతుంది. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకు భయం లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ హఠాత్పరిణామంతో కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. కాగా దాడి చేసిన వ్యక్తి సనాతన ధర్మానికి అవమానం జరిగితే సహించబోమంటూ కోర్టు హాలులో చేసిన నినాదాలనుబట్టి దాడికి ప్రేరణ ఏమిటో, ఎవరో సులభంగానే బోధ పడుతుంది. జస్టిస్ గవాయ్ పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి.జస్టిస్ గవాయ్ పై దాడి ఘటన అదేదో సాదాసీదా యాదృచ్చికంగా చోటు చేసుకున్నది కాదు. కేవలం ఒక వ్యక్తి పిచ్చి అంతనకన్నా కాదు. వందేళ్ల ఆర్ఎస్ఎస్, పరివారం ప్రజల మెదళ్లకు ఎక్కించిన విద్వేష విషం. ప్రజల్లో మత విభజన సిద్ధాంత భావజాల వ్యాప్తిని ఘటన ప్రతిబింబిస్తుంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక వ్యవస్థల ధ్వంసం సైద్ధాంతికంగా ఒక పథకం ప్రకారం సాగుతోంది. న్యాయ వ్యవస్థను సైతం వదిలిపెట్టలేదు. జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. సనాతన ధర్మాన్ని మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకొని ప్రచారం చేస్తున్న తరుణంలో, జస్టిస్ గవాయ్ పై దాడుల వంటివే సనాతన ధర్మమా? మోడీ, బిజెపి సమాధానం చెప్పాలి. మన రాష్ట్రంలో సనాతన ధర్మంపై ప్రచారం చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్, చీఫ్ జస్టిస్‌పై సనాతన వాది దాడిని ఖండిస్తారా, లేక మద్దతిస్తారో స్పష్టం చేయాలి. గవాయ్ పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తుండగా, ఇప్పటి వరకు బిజెపి, మోడీ ప్రభుత్వం నుంచి ఎలాంటి బహిరంగ స్పందన వెలువడలేదు. దీన్నిబట్టి దాడిని పరోక్షంగా స్వాగతిస్తున్నారనుకోవాలి.జస్టిస్ గవాయ్ దళిత కులానికి చెందిన వారైనందున, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ అయిన దగ్గర నుంచీ సంఘ్ పరివారం, బిజెపి



ఆయన్ని లక్ష్యంగా చేసుకొని వ్యతిరేక ప్రచారం లంకించుకున్నాయి. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. జస్టిస్ గవాయ్ తల్లిదండ్రులపై మహారాష్ట్రలోని సంఘ్ పరివార్ మూకలు సోషల్‌మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తుండటంపై వారు బహిరంగంగా నిరసన తెలియజేశారు. మొన్న అక్టోబర్ 5న మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతవార్షికోత్సవానికి రావాలన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్లు గవాయ్ తల్లి ప్రకటించారు. బీహార్ ఓటర్ల సవరణ, గవర్నర్ల వ్యవహారశైలి తదితరాలపై గవాయ్ జారీ ఉత్తర్వుల నేపథ్యంలో రాజకీయ కారణాలు కూడా ఆయనపై దాడికి పురిగొల్పి ఉండవచ్చు. ఈ పూర్వరంగంలో చూస్తే గవారుపై ఉద్దేశపూర్వకంగానే సంఘ్ పరివారం, బిజెపి పగబట్టి వెంటబడి వేధిస్తున్నాయని అర్థమవుతుంది. ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమన్న పరివార్ హెచ్చరికగా గవాయ్ పై దాడిని పరిగణించాలి. కోర్టు హాలులో గవారుపై దాడిని అగ్రకుల సనాతన ఉన్మాద సంస్కృతిలో భాగంగా చూడాలి. విభజన, విషపూరిత రాజకీయాల ప్రభావంతో సాగుతున్న విద్వేష చర్యలను అందరూ కలిసి సమర్ధవంతంగా ఎదుర్కోవాలి. ఆ కర్తవ్య కార్యాచరణే వైవిధ్యభరిత భారతావనికి, రాజ్యాంగానికి తిరుగులేని రక్షణ కవచం.

## నగరంలో బస్ ఛార్జీల పెంపు దారుణం

హైదరాబాద్,ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.

## పత్తి రైతులకు అండగా ఉంటాం

న్యూఢిల్లీ, పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి.రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

## అన్ని క్షిపణులకు బాప్...

న్యూఢిల్లీ,భారత రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థ మరోసారి ప్రపంచ రక్షణ వర్గాల దృష్టిని ఆకర్షించింది. అత్యాధునిక సాంకేతికత, హైపర్సోనిక్ వేగం, కృత్రిమ మేధస్సు కలయికతో రూపొందిస్తున్న "స్టార్ మిసైల్" ప్రాజెక్ట్ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.ఇది భారతీయ రక్షణ సామర్థ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లబోతోందని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

మాక్ 7 వేగంతో దూసుకెళ్లే అస్త్రం

DRDO రూపొందిస్తున్న ఈ స్టార్ క్షిపణి ధ్వని వేగం కంటే కనీసం మాక్ 7 లేదా అంతకంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉందని ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అసాధారణ వేగం కారణంగా శత్రువుల క్షిపణి రక్షణ వ్యవస్థలు దీనిని గుర్తించడం, అడ్డుకోవడం అనేది దాదాపు అసాధ్యం. ఈ క్షిపణి పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతోంది. దీనిలో స్క్రామ్‌జెట్ , రామ్‌జెట్ ఇంజిన్‌ల కలయికను ఉపయోగిస్తున్నారు, ఇది సుదీర్ఘకాలం పాటు అత్యధిక వేగాన్ని నిలుపుకోవడానికి దోహదపడుతుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ క్షిపణి 2,000 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగలదు. ఇది వ్యూహాత్మకంగా భారత్‌కు అపారమైన శక్తిని అందిస్తుంది.

కృత్రిమ మేధస్సుతో ఆలోచించే ఆయుధం

ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత విప్లవాత్మకమైన అంశం దానిAI-ఆధారిత గైడెన్స్ సిస్టమ్. ఈ అత్యాధునిక సాంకేతికతతో స్టార్ మిసైల్ గగనతలంలో ఎదురయ్యే ప్రతీ పరిస్థితిని, శత్రువుల కదలికలను స్వయంగా విశ్లేషించి, దానికి అనుగుణంగా తన మార్గంలో మార్పులు చేసుకోగలదు. ఒక సీనియర్ DRDO శాస్త్రవేత్త దీని గురించి మాట్లాడుతూ "ఇది సాధారణ క్షిపణి కాదు. ఇది ఆలోచించే ఆయుధం. %యాూ=% క్షిపణి ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొని, శత్రు రక్షణ వ్యవస్థలను మోసం చేసి, ఎదురుదాడులను తప్పించుకుంటూ తన లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంటుంది," అని తెలిపారు.

ప్రపంచ రక్షణ వర్గాల్లో సంచలనం

స్టార్ మిసైల్ ప్రాజెక్ట్ గురించి సమాచారం బయటకు వచ్చిన వెంటనే ప్రపంచ దేశాల్లోని రక్షణ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. ముఖ్యంగా అమెరికా, రష్యా, చైనా వంటి సాంకేతికంగా ముందున్న దేశాల నిపుణులు భారత్ సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని, హైపర్సోనిక్ - AI-ఆధారిత క్షిపణుల రంగంలో లీడర్‌గా అవతరించే అవకాశాలను గురించి చర్చించుకుంటున్నారు.

# జూబ్లీహిల్స్ టీడీపీ ఓటర్లు ఎవరికి జైకొడతారు?



హైదరాబాద్,తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయకూడదని టీడీపీ నిర్ణయించడంతో సరికొత్త చర్చ మొదలైంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతోంది. వచ్చేనెల 11న జరిగే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ టీడీపీ తొలుత ఉత్సాహం ప్రదర్శించింది. అయితే కేడర్ సన్నద్ధంగా లేరన్న కారణంగా ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ టీడీపీ నేతలు సమావేవమయ్యారు.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పట్టుకోల్పోతూ వస్తున్న టీడీపీ.. మళ్లీ పుంజుకోవాలనే ఆలోచనపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని తాజా నిర్ణయంతో స్పష్టమైందని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. ఆ పార్టీ సానుభూతిపరుల ఓట్లు కొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తాయన్న అంచనాలు ఉన్నాయి. అయితే టీడీపీ సొంతంగా పోటీ చేసి గెలిచే పరిస్థితి లేకపోవడం, ఆ పార్టీతో పొత్తు పెట్టుకోడానికి ఇతర పార్టీలు సాహసించలేని పరిస్థితులు ఉండటంతో ఒంటరి పోటీ సరైన నిర్ణయం కాదని టీడీపీ అధినేత చంద్రబాబు డిసైడ్ అయ్యారని అంటున్నారు.ఈ నేపథ్యంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఎటువైపు మళ్లుతాయనే చర్చ ప్రధానంగా జరుగుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్నట్లు గత ఎన్నికలు నిరూపిస్తున్నాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానాన్ని బీజేపీ మద్దతుతో టీడీపీ గెలుచుకుంది. ఆ తర్వాత పరిణామాలతో టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా బలహీనపడగా, జూబ్లీహిల్స్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఇక 2018, 2023 ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే మాగంటి గోపీనాథ్ మూడుసార్లు ఈ నియోజకవర్గం నుంచి గెలవడానికి టీడీపీ సానుభూతిపరుల ఓట్లు, కమ్మ సామాజికవర్గం మద్దతు కీలకంగా చెబుతున్నారు. టీడీపీకి వెన్నుదన్నుగా నిలిచే కమ్మ సామాజికవర్గం ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపే సంఖ్యలో ఉండటంతో వీరి ఓట్లు ఇప్పుడు నిర్ణయాత్మకశక్తిగా మారే అవకాశం ఉందంటున్నారు.టీడీపీ పోటీ చేయకపోవడం, తమ అభిమాన నేత మాగంటి గోపీనాథ్ మరణంతో వారి ఓట్లు ఎటు మళ్లుతాయనేది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. మాగంటి భార్య సునీత బీఆర్ఎస్ అభ్యర్థిగడా పోటీ చేస్తుండటంతో సానుభూతితో ఆమెకు మద్దతుగా నిలుస్తారా? లేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉన్న సానుకూలతతో అటువైపు మొగ్గుతారా? అన్న సందిగ్ధత నెలకొంది. ఏపీలో బీజేపీతో పొత్తు ఉండటం వల్ల చివరి నిమిషంలో బీజేపీ అభ్యర్థికి పార్టీ మద్దతు ప్రకటిస్తే అటు వైపు నిలిచే అవకాశం ఉందా? అన్న చర్చ జరుగుతోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటిలానే టీడీపీ పోటీకి దూరంగా ఉండిపోయింది. ఎన్నికల ప్రచారంలో ఎక్కడా కనిపించని ఆ పార్టీ జెండాలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయోత్సవంలో రెపరెపలాడాయి. జూబ్లీహిల్స్ లో రేవంత్ రెడ్డి నివాసం నుంచి గాంధీభవన్ వరకు జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జెండాలతోపాటు టీడీపీ పతాకం రెపరెపలాడింది. దీంతో ఈ ఎన్నికల్లో టీడీపీ ఓటర్లు ఎటువైపు అన్న ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

# బీహార్ ఎలక్షన్: కులమా-పొలిటికల్ బలమా?

బీహార్,రాజకీయాలకు –కులాలకు మధ్య సంబంధం గురించి ఇటీవల ఓ కీలక మీడియాలో వచ్చిన కథనం.. అంతా ఏపీలోనే ఉందని! కులాలు.. రాజకీయాల కలగాపులగం అంతా.. ఏపీ నుంచే ప్రారంభమైందని.. సదరు మీడియా తీర్మానం చేసింది. కానీ.. ఉత్తరాదిన ఉన్న కుల రాజకీయాలు మరెక్కడా లేవన్నది సర్వేలు చెబుతున్న మాట. అందునా.. బీహార్‌లో అయితే.. కీలకమైన యాదవ సామాజిక వర్గం.. కుర్మీ సామాజిక వర్గంనాయి సామాజిక వర్గాలు.. మూడుగా చీలి.. రాజకీయాలను శాసిస్తున్నాయి. తాజాగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కులమా.. పొలిటికల్ బలమా? ఏది ఇక్కడి ప్రభుత్వాన్ని.. ఎన్నికలను శాసిస్తుంది? అనేది కీలకంగా మారింది.

కులం పరంగా చూసుకుంటే..

ఒకప్పుడు యాదవ సామాజిక వర్గం మొత్తం.. ఆర్జేడీ నేత.. మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ వెంటే నడిచింది. అంతేకాదు.. ప్రత్యేక బీహార్ రాష్ట్ర ఏర్పాటు కోసం.. ఆయన అలుపెరుగని యుద్ధమే చేశారు. ఇది అప్పట్లో యాదవ సామాజిక వర్గాన్ని ఆయ న ఏకం చేశారు. ఇది కొన్ని దశాబ్దాల పాటు.. ఆయన వెంట యాదవులను నడిపించింది. అయితే.. రాను రాను లాలూ ప్రసాద్ ప్రాభవం తగ్గడంతోపాటు.. ఆయన జైలుకు వెళ్లిన దరిమిలా.. ఈ ఓటు బ్యాంకు విచ్ఛిన్నమై.. బీజేపీకి మద్దతుగా నిలుస్తోంది. ఇక, సంప్రదాయ బ్రాహ్మణ సామాజిక వర్గం.. ఆది నుంచి బీజేపీవైపే ఉంది. దీనికి ముందు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు.ఇక, ఇప్పుడు పరిస్థితిని చూస్తే.. బీజేపీ ఆశలన్నీ.. ఓబీసీలపైనే ఉన్నాయి. ఈ వర్గం.. మొత్తం రాష్ట్రంలో 37 శాతం జనాభాను కలిగి ఉంది. అందుకే.. ఈబీసీలో ఉన్న నాయి సామాజిక ఉద్యమ కర్త.. దివంగత కర్పూరీ ఠాకూర్‌కు మోడీ సర్కారు భారత రత్న ఇచ్చి సత్కరించింది. ఇప్పుడు దానిని ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఉంది. అదేవిధంగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ గా ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్ కూడా ఓబీసీ నాయకుడే. పైగా బీజేపీ నేత. ఈ నేపథ్యం కూడా బీజేపీకి కలిసి రానుంది.




ఇక, 18 శాతంగా ఉన్న యాదవ సామాజిక వర్గంలో కొంత మేరకు చీలిక వచ్చినా.. 11 శాతం ఓటు బ్యాంకు ఆర్జేడీ వైపే ఉంది. దీనిపైనే తేజస్వి యాదవ్(లాలూ కుమారుడు) ఆశలు పెట్టుకున్నారు.అందుకే.. యాదవ సామాజిక వర్గమే.. కాదు.. ఓబీసీలను కూడా తనవైపు తిప్పుకొనేందుకు ఆయన బీహార్ అధికార యాత్రచే పట్టారు. తద్వారా రాష్ట్రంలో ఆయా సామాజిక వర్గాలను తనవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఇక, తటస్థ ఓటు బ్యాంకు కేవలం 23 శాతం మాత్రమే ఉంది. ఇక, ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకు 20 శాతంగా ఉంది. దీనిపై అటు ఆర్జేడీ, ఇటు కాంగ్రెస్ ఆది నుంచి పట్టు సాధిస్తున్నాయి. కానీ, ఈ దఫా గిరిజన ప్రాంతాల్లో చేసిన అభివృద్ధిని బీజేపీ ప్రచారం చేస్తోంది. సో.. ఇక్కడ కూడా ఓటు బ్యాంకు చీలే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సో.. ఎలా చూసుకున్నా.. రాజకీయ బలాల కన్నా.. కులాల కుంపట్లపైనే ఎక్కువగా ఈ ఎన్నిక ఆధారపడిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, మరో కీలకమైన విషయం.. సీఎం నితీష్ కుమార్ సామాజిక వర్గం కుర్మి. ఈ సామాజిక వర్గం ప్రజలు కేవలం 3 శాతమే ఉన్నారు. అయితేనే.. ఆ ఓట్లన్నీ.. సుశాన్‌బాబు(మంచి పాలనా దక్షుడు)గా పేరున్న నితీష్‌కే పడుతున్నాయి. సో.. ఇదీ.. సంగతి!!.

# కాంగ్రెస్ మంత్రుల మధ్య కొత్త పంచాయతీ !

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎవరూ ప్రశాంతంగా ఉండటం లేదు. పదవులు వచ్చే వరకూ ఓ బాధ.. వచ్చిన తర్వాతా మరో బాధ. అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ మధ్య పొసగని పరిస్థితి వైరల్ గా మారింది. ఇటీవల ఓ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను దున్నపోతు అని కించ పరిచారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.దీంతో అడ్లూరి లక్ష్మణ్ ఫీల్ అయ్యారు. మంగళవారం ఉదయం ఆరు నిమిషాల వీడియో రిలీజ్ చేసి.. పొన్నం ప్రభాకర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తనను బాడీ షేమింగ్ చేయడం ఏమిటని..తన పరువు పోయిందన్నారు. అలాగే మరో మంత్రి వివేక్ పైనా ఆరోపణలు చేశారు. తాను వచ్చి కూర్చుకుంటే.. వివేక్ వెళ్లిపోతున్నారని అన్నారు. మాదిగ వర్గానికి చెందిన మంత్రిని అయిన తనను ఇలా కించపర్చడమేమిటని ఆయనంటున్నారు. ఈ అంశంపై ఆయన హైకమాండ్ కు లేఖలు రాశారు.ఈ ఘటనపై వెంటనే టీ పీసీసీ చీఫ్ స్పందించారు. పొన్నంతో పాటు అడ్లూరి లక్ష్మణ్ తో మాట్లాడారు. దీంతో అడ్లూరి లక్ష్మణ్.. కాంగ్రెస్ పెద్ద కుటుంబంన్నీ చిన్న చిన్న సమస్యలు ఉంటాయన్నారు. తన మాటల్ని వక్రీకరించారని పొన్నం చెప్పుకొచ్చారు. మరో వైపు వివేక్.. మీనాక్షి నటరాజన్ తో సమావేశం ఉండటం వల్ల అడ్లూరి లక్ష్మణ్



నిర్వహించిన సమావేశం మధ్యలో వెళ్లానన్నారు. ఇలా ఎవరికి వారు వారి వెర్షన్ చెబుతున్నారు.కానీ కాంగ్రెస్ మంత్రుల పంచాయతీ మాత్రం హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ పార్టీ నెత్తి మీద ఎవరూ చేయి పెట్టాల్సిన పని లేదని.. వారే పెట్టుకుంటారని సెటైర్లు వేస్తున్నారు.

# పిసి ఘోష్ కమిషన్‌పై విచారణ..12వతేదీకి వాయిదా వేసిన హైకోర్టు




హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి,ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు,ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# ఖర్గేతో విడిగా పొంగులేటి భేటీ...రేవంత్‌కు దూరమయ్యారా?



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీ అధ్యక్షుడు ఖర్గేను పరామర్శించడానికి బెంగళూరు వెళ్లారు. అనారోగ్యం కారణంగా చికిత్స తీసుకుని ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు ఖర్గే. రేవంత్ సోమవారం వెళ్లి పరామర్శించి..జూబ్లిహిల్స్ ఉపఎన్నికపై చర్చించి వచ్చారు. మంగళవారం ఖర్గేను పరామర్శించడానికి పొంగులేటి వెళ్లారు. సీఎంతో వెళ్లకుండా ఆయన విడిగా వెళ్లడం ఏమిటని కాంగ్రెస్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో రేవంత్ ఎక్కడికి వెళ్లినా పక్కన పొంగులేటి కనిపించేవారు. కొన్నాళు అలాగే నడిచింది. తర్వాత క్రమంగా పొంగులేటి రేవంత్ తో కలిసి కనిపించడం తగ్గిపోయింది. రేవంత్ వద్ద ఉన్న ప్రాధాన్యతను ఆయన దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. పలువురు ఎమ్మెల్యేలు ఆయనపై ఆరోపణలు గుప్పించారు. ఆ తర్వాత నుంచి ఆయన ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు ఏ కార్యక్రమంలోనూ కలిసి వెళ్లడం లేదు. ముఖ్యమంత్రి వెళ్తున్నారంటే ఆయనతో పాటు వెళ్లి ఖర్గేను పరామర్శించవచ్చు.కానీ పొంగులేటి మాత్రం తాను ప్రత్యేకంగా వెళ్లి పరామర్శించారు. పార్టీ వ్యవహారాలపై మాట్లాడకుండా ఉండరని.. మాట్లాడి ఉంటారని భావిస్తున్నారు. పొంగులేటి రేవంత్ కు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తారని ఎవరూ అనుకోవడం లేదు కానీ.. భవిష్యత్ లో ఏం జరుగుతుందో చెప్పలేమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా మెడికల్ కాలేజీలు

అమరావతి,ఈనెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శిస్తానని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అలాగే అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం ఉంటుందని, మెడికల్ కాలేజీల ప్రైవటీకరణపై కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. కోటి సంతకాలను రచ్చబండ కార్యక్రమాల ద్వారా సేకరిస్తామని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గ సమన్వయ కర్త ప్రతిరోజూ రెండు గ్రామాలను సందర్శిస్తాడని, అలాగే నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్స్ ద్వారా చైతన్యపరిచే కార్యక్రమాలు ఉంటాయని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కీలక విషయాలపై మాట్లాడారు. 'అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబర్ 12న ర్యాలీలు జరుగుతాయి. ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబర్ 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబర్ 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్ గారికి అప్పగించే కార్యక్రమం తదుపరి జరుగుతుంది' అని వైఎస్ జగన్ తెలిపారు. 'ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. మన హయాంలో నో వేకెన్సీ బోర్డులు చూశాం. ఎరువుల కోసం రైతులు రో÷–డడెక్కడం ఇప్పుడు చూస్తున్నాం. మన హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ అలాంటివి లేవు. ఎరువుల పంపిణీలో కూడా స్కాం చేశారు. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు' అని మాజీ సీఎం మండిపడ్డారు. 'భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా చేస్తున్నారు. మనం కొత్తగా పెట్టిన కాలేజీలను ఇప్పుడు తన బినామిలకు, మనుషులకు తెగనమ్ముతున్నాడు. మనం వచ్చేంత వరకూ రాష్ట్రంలో ఉన్నవి 12 గవర్నమెంట్



మెడికల్ కాలేజీలు మాత్రమే. మనం ఒక విజన్‌ను ఆవిష్కరించాం. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది. అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి. మనం ఉన్నప్పుడే 2023–24లోనే కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు కాలేజీలు క్లాసులకు అందుబాటులోకి తెచ్చాం. తద్వారా 800 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. పులివెందులోల 50 సీట్లు ఔఓఅ ఇస్తే.. వద్దని చంద్రబాబు లెటర్ రాశాడు. మన హయాంలోనే అవసరమైన నిధులకు ÷నాన్సియల్ టై అప్ చేశాం. అమరావతికి 50వేల ఎకరాలు సరిపోవని, మరో 50వేల ఎకరాలు సేకరిస్తున్నాడు. మొదటి 50 వేల ఎకరాలకే మౌలిక సదుపాయాలకోసం రూ. 1లక్ష కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పాడు. ఇప్పుడు కేవలం మౌలిక సదుపాయాలకే 2 లక్షల కోట్లు అవుతుందని చెప్తున్నారు. అలాంటి లక్షల మందికి, కోట్ల మందికి వైద్యం అందించి, చిరస్థాయిగా నిలబడే ఆస్తులైన మెడికల్ కాలేజీలను అప్పనంగా అమ్మేస్తున్నారు. ఐదేళ్లలో రూ. 5వేల కోట్లు పెట్టలేరా?. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది' అని నేతలను ఉద్దేశించి జగన్ అన్నారు.

# బీఆర్ఎస్‌లో కౌశిక్ రెడ్డి కుంపటి.. ఇన్ని చిందులా?



హైదరాబాద్,తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో ఆది నుంచి ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు కోసం తహ తహలాడుతున్న కౌశిక్ రెడ్డి.. తాజాగా మరో కుంపటి నెత్తిన పెట్టుకున్నారు. తాను పెట్టుకున్నదే కాకుండా.. పార్టీని కూడా బజారున పడేశారు. గత 2023 ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి తొలిసారి విజయం దక్కించుకున్నారు. ఆ సమయంలో ఆయన కుటుంబంతో సహా.. సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ దఫా గెలిపించకపోతే.. తాను పాడె ఎక్కుతానని నియోజకవర్గ ప్రజలను సెంటిమెంటుతో ఆకట్టుకున్నారు. ఇదివివాదం కూడా అయింది.ఇక, ఆ తర్వాత పాడి గెలవడం.. అనేక సందర్భాల్లో ఆయన వివాదాలను నెత్తిన వేసుకుని యాగీ చేయడం తెలిసిందే. దీనివల్ల బీఆర్ఎస్‌కు చిన్నపాటి ప్రయోజనం కూడా లభించలేదు. అయినా.. కూడా.. పాడి మాత్రం తన దూకుడును తగ్గించడం లేదా.. సొంత పార్టీ అనుకూల వాదులను, పార్టీ నాయకులను కూడా ఆయన బెదిరించారు. అలా ఇలా కాదు.. ఏకంగా తీవ్రస్థాయిలో బెదిరించారు. ప్రస్తుతం స్థానిక సంస్థలకు ఎన్నికల రంగం రెడీ అయింది. ఈ నేపథ్యంలో ఆయన నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలను కౌశిక్ రెడ్డి కలుస్తున్నారు. అయితే.. ఈ సందర్భంగా కమలాపూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు మంటలు రేపుతున్నాయి. "బీఆర్ఎస్ తరఫున గెలిచి.. తర్వాత వేరే పార్టీలలోకి మారితే.. తుక్కుతుక్కు కింద చిత్తు రేగ్గొడతం!" అంటూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ నాయకులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని అంటున్నారు. అంతేకాదు.. "ఎవడైనా.. ఇప్పుడు గెలిచి.. తర్వాత.. వేరే పార్టీలోకి చేరితే.. వెయ్యి మందితో ఇళ్లపైకి వచ్చి.. చుక్కలు చూపిస్తం. తుక్కు రేగ్గొడతాం" అని పదే పదే వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు.. ఆవేశంలో అన్నారో.. ఆవేదనతో అన్నారో తెలియదు కానీ.. కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు నాయకులు రెడీ అయ్యారు. అంతనమ్మకం లేనప్పుడు.. తాము పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని అంటున్నారు. అంతేకాదు..కౌశిక్ రెడ్డి కి మంత్రి పదవి ఇస్తామంటే.. జంపైపోడా? అని ఒకరిద్దరు నిప్పులు చెరిగారు. అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయని.. నోరేసుకుని.. కార్యకర్తలు, నాయకులను అవమానించేలా మాట్లాడితే.. ఊరుకునేది లేదన్నారు. కేసీఆర్ అంతటివారే అందరినీ నమ్ముతున్నారని.. ఈయనెంత? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంద్రకీలాద్రికి దసరా ఆదాయం

విజయవాడ,విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర ఆలయానికి రికార్డు స్థాయి హుండీ ఆదాయం వచ్చింది. దసరా నవరాత్రుల 11 రోజుల హుండీని మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. 2025 దసరా హుండీ ఆదాయం రూ. 10.30 కోట్లు దాటింది.

# మద్యం మాఫియాను నడిపిందే జగన్

విజయవాడ,ఏపీలో మద్యం మాఫియా తయారు చేసింది మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కాదా అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌతాఫ్రికాలో వైసీపీ పెద్దలకు మద్యం వ్యాపారాలు లేవా..? అని నిలదీశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. తంబల్లపల్లి కల్తీ మద్యం వెనుక ఉన్న మూలాలు అన్నింటినీ బయటకు తీస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఎంతటి వాళ్ల ఉన్నా విడిచి పెట్టం, అవసరమైతే పీడీ యాక్టులు కింద కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. తంబల్లపల్లి వద్ద కల్తీ మద్యాన్ని గుర్తించింది తమ ఎక్సైజ్ శాఖ అధికారులేనని స్పష్టం చేశారు. నిరంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తున్నామని.. కాబట్టే కల్తీ మద్యాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకున్నామని క్లారిటీ ఇచ్చారు. తమ పార్టీ వాళ్లు ఇద్దరు ఉన్నారని తెలిసిన వెంటనే.. ఆ ఇద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయించామని గుర్తుచేశారు. కల్తీ మద్యంపై శాఖాపరంగా సమగ్ర విచారణ జరుగుతోందని చెప్పుకొచ్చారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com